అభివృద్ధి నిరంతర ప్రక్రియ

చిల్పూరు: బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. మండలంలోని కృష్ణాజీగూడెంలో బుధవారం సీఆర్ఆర్ నిధుల నుంచి రూ.1.50 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధుల నుంచి రూ. 20 లక్షలతో చేపట్టిన జీపీ భవన నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ పట్టు అంజనీదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీటీసీ సాదం నర్సింహులు, నాయకులు భూక్య రమేష్, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, మల్లారెడ్డి, రాములు, విష్ణు, వెంకటేశ్వర్లు, రమ, వెంకట్, చేరాలు, ఆనందం పాల్గొన్నారు.

అధికారులపై జెడ్పీ చైర్మన్ మండిపాటు

తనకు ఒక రోజు ముందు సమాచారం అందివ్వకుండా సమావేశాలను ఏర్పాటు చేయడంపై అధికారులపై జెడ్పీ చైర్మన్ మండిపడ్డాడు. ప్రతీసారి చెబుతున్నా మార్పు రావడంలేదని అన్నారు.

ప్రొటోకాల్ పాటించడం లేదు

గ్రామ పంచాయతీ నూతన భవనం శంకుస్థాపన శిలాఫలకంపై తన పేరు ఎందుకు లేదంటూ ఉప సర్పంచ్ సాదం రవి ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌ల ఎదుట నిరసన వ్యక్తం చేశాడు. సర్పంచ్‌తో సమానంగా చెక పవర్ ఉన్నా పట్టించుకోరా అంటుండగా ఎమ్మెల్యే కల్పించుకుని నచ్చజెప్పారు.

ఐదోసారి గెలుస్తా..

స్టేషన్‌ఘన్‌పూర్: హరిహర బ్రహ్మాదులు అడ్డుపడినా, ఎవ్వరు ఎన్ని కుట్రలు చేసినా తాను ఐదో సారి ఎమ్మెల్యేగా గెలిచి తీరుతానని డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని జిట్టెగూడెం, రాఘవాపూర్ గ్రామాల్లో మొత్తం రూ.5.20కోట్ల నిధులతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు.


చిల్పూరు: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే

అభివృద్ధిపై నిలదీసిన ప్రజలు

రాఘవాపూర్ సమావేశంలో పలు అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే చెప్పగా మహిళలు, ప్రజలు ఏమి అభివృద్ధి చేశారని నిలదీశారు. డబుల్ బెడ్రూం ఇళ్లు ఎందుకు పంపిణీ చేయలేదని, రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, రహదారి పక్కన సర్వీసు రోడ్లు వేయలేదని ప్రశ్నించారు. జెడ్పీటీసీ రవి, ఎంపీపీ రేఖగట్టయ్య, వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో హ్యాట్రిక్ సాధించాలి

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

బచ్చన్నపేట: రాష్ట్రంలో రానున్న శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అధిక మెజార్టీతో ఎక్కువ సీట్లను గెలిపించి కేసీఆర్‌ను మళ్లీ సీఎం సీట్లో కూర్చోబెట్టి హ్యాట్రిక్ సాధించాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పడమటికేశ్వాపూర్‌లో 11 గ్రామ పంచాయతీల నాయకులు, కార్యకర్తలతో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరువుతో అల్లాడున్న జనగామ నియోజకవర్గాన్ని సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని గోదావరి జలాలను తెప్పించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారని అన్నారు. రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్ రెడ్డి, మండల అధ్యక్షులు బొడిగం చెంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, సర్పంచ్‌ల, ఎంపీటీసీల మండల ఫోరం అధ్యక్షులు గంగం సతీష్‌రెడ్డి, దూడల కనుకయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

నివాళి..

జనగామ రూరల్: పెంబర్తికి చెందిన సిరంగి రాజు ప్రమాదవశాత్తు మృతిచెందాడు. కాగా, బుధవారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

పనులు నిలిపివేయాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఖిలాషాపూర్ గ్రామస్తులు, పక్కన అదనపు కలెక్టర్

జనగామ: రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్‌లో ఏర్పాటు చేస్తున్న తారా టిన్నర్ కెమికల్ కంపెనీ పునఃప్రారంభ పనులను వెంటనే నిలిపి వేయాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సీహెచ్ శివ లింగయ్యకు విన్నవించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 2017లో తారా టిన్నర్ కంపెనీని ఏర్పాటు చేశారన్నారు. దీని ద్వారా వచ్చే రసాయన వాయువులతో గాలి కాలుష్యమై తమ ప్రాణాలకు ముప్పుగా మారిపోయిందన్నారు. దీంతో పాటు కంపెనీ వ్యర్థాలను సమీప ప్రాంతాల్లో గుంతలు తీసి పూడ్చి వేయడంతో అరకిలో మీటరు మేర భూగర్భజలాలు కలుషితమై, తాగేందుకు వీలు లేకుండా పోయిందని కలెక్టర్‌కు వివరించారు. 2020 జనవరి 31న తారా టిన్నర్ కంపెనీలో రియాక్టర్ ఛార్జి చేస్తుండగా, ఒక్కసారిగా మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాప్తి చెందడంతో పెను ప్రమాదం తప్పింది. పక్కనే ఉన్న కేజీబీవీ బాలికల విద్యాలయంలోని 150 మంది విద్యార్థినులతో పాటు పదుల సంఖ్యలో గ్రామస్తులు సైతం అస్వస్థతకు గురై అప్పట్లో ఆస్పత్రి పాలయ్యారన్నారు. ఆ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కంపెనీని నాటి కలెక్టర్ సీజ్ చేశారని చెప్పారు. మూడేళ్ల తర్వాత పనులను తిరిగి పునఃప్రారంభిస్తున్నారని, ఈ విషయంపై కంపెనీ ప్రతినిధులను ప్రశ్నించగా గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కలెక్టర్‌కు తెలిపారు. గ్రామ ప్రజల ప్రాణాలకు పెను ముప్పుగా మారిన టిన్నర్ కంపెనీ ఏర్పాటును నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేయాలని విన్నవించారు. సర్పంచ్ ముప్పిడి శ్రీధర్, ఎంపీటీసీ అల్లిబిల్లి కృష్ణ,ఉడుత రవి, యూత్ నాయకులు యామంకి సుధాకర్, పెంతల మైపాల్, అల్లపు నర్సయ్య, గాదె నర్సింగరావు, బాల్నే రవి, అవుదుడ్డి మహేష్, బాల్నె సురేష్‌తోపాటు తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరాలి

బచ్చన్నపేట: రాష్ట్రంలో బీజేపీ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. బుధవారం మండలంలోని సాల్వాపూర్‌లో బూత్ స్థాయి స్వశక్తీకరణ్ అభియాన్‌లో భాగంగా కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల అధ్యక్షులు సద్ది సోమిరెడ్డి, జిల్లా కార్మిక సభ్యులు గీస సందీప్, మండల ప్రధాన కార్యదర్శి గద్ద రాజు, మాజీ సర్పంచ్ సింగరయ్యగౌడ్, మల్లేశం, కనుకయ్య, తిరుపతి, రాజు, చారి, మహేష్, రవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బేజాడి బీరప్ప

పట్టా ఉన్న అందరికీ ఇళ్లు ఇవ్వాలి

జనగామ రూరల్: మూడో విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు ఉన్న ప్రతీ ఒక్క లబ్ధిదారుడికి ఇళ్లు ఇవ్వాలని ఐద్వా మహిళ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఇర్రి అహల్య అన్నారు. ఏలమ్మనగర్ డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద చేపడుతున్న దీక్షలు బుధవారం 32వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె దీక్షను ప్రారంభించి మాట్లాడారు. లబ్ధిదారులు 32 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి పట్టించుకోవడం లేదని, తక్షణం అధికారులతో చర్చించి పట్టాలు అందించాలని అన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, ఉపేందర్, లింగం, లలిత పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

దేవరుప్పుల: ఈ నెల 20 ధర్మాపురంలో తలపెట్టిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు జాటోత్ ఠాణు నాయక్ వర్ధంతి సభను జయప్రదం చేయాలని సేవాలాల్ సేన జిల్లా నాయకుడు లావుడియా అనిల్‌చౌహాన్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితోనే నేటి తెలంగాణ సాధించుకున్న తరుణంలో అమరుల ఆశయాలను పాలకవర్గాలు విస్మరించాయని విమర్శించారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం కొనసాగిన పోరాటంలో గిరిజన ముద్దుబిడ్డ ఠాణునాయక్ మొండ్రాయి వద్ద విస్నూర్ దేశముఖ్‌ల తూటాలకు ఎదురొడ్డి ప్రాణత్యాగం చేసిన చరిత్రను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

సన్మానం



జనగామ రూరల్: జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పెంబర్తికి చెందిన బాల్దె సిద్దిలింగం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సిద్దిలింగం-విజయ దంపతులను బుధవారం సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు బొల్లం శారద స్వామి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతా..


మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

నర్మెట: జనగామ నియోజకవర్గంలో గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి శూన్యమని, నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తే అభివృద్ధికి పాటు పడుతానని పీసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం హాథ్ సే హాథ్ జోడో అభియాన్ పాదయాత్రలో భాగంగా 4వ రోజు మండలంలోని కన్నెబోయినగూడెం, ధరావత్ తండా, భీక్య తండా, వెల్దండ, అమ్మాపురం, నర్మెటల్లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మండలంలో నేను జెడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులే తప్ప ఇంతవరకు ఎలాంటి అభివృద్ధి జరుగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిత్యావసర సరుకుల, గ్యాస్ సిలిండర్ల ధరలను తగ్గించి సామాన్యులకు భారం లేకుండా చేస్తామని తెలిపారు. మాజీ జెడ్పీటీసీ గాదె మోహన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నర్సింహ్మారెడ్డి, నాయకులు జయరాం నాయక్, పర్షరాములు, రామకృష్ణ, శ్రీధర్, నాయక్, సురేందర్‌గౌడ్, లక్ష్మయ్య, బాలనర్సు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

జనగామ: జనగామ మండలం అడవికేశ్వాపూర్ గ్రామానికి చెందిన యువరైతు, గూడ రాజు ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. కాగా, బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సర్పంచ్ బానోత్ జయరాం, ఉప సర్పంచ్ మేకల శ్రీను, గ్రామ శాఖ అధ్యక్షుడు దండు కుమార్, గ్రామ కో ఆప్షన్ మెంబర్ బత్తిని సతీష్, మాజీ సర్పంచ్ నరేందర్ యాదవ్, నిఖిల్, సతీష్ పాల్గొన్నారు.


జనగామ: ఆర్థిక సాయం అందజేస్తున్న కిరణ్

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

తరిగొప్పుల: అనారోగ్యంపాలై ఆస్పత్రిలో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు. మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు నాగపూరి భాస్కర్‌గౌడ్ గతంలో ప్రమాదవశాత్తు తాటి చెట్టుపైనుంచి పడడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందాడు. కాగా, కిరణ్‌గౌడ్ దృష్టికి బాధితుడు తీసుకువెళ్లగా స్పందించిన ఆయన సీఎంఆర్ఎఫ్ కింద రూ.12,500 మంజూరు చేయించి బాధితుడికి చెక్కును బుధవారం అందజేశారు.

ఏఎంసీలో రఘునాథపల్లి మండలానికి ప్రాధాన్యం


ఎం.విజయ్‌కుమార్


యాకస్వామి


మాల రాజు


శివరాత్రి రాజు

- వైస్‌చైర్మన్‌తో పాటు ముగ్గురు డైరెక్టర్లు

రఘునాథపల్లి: జనగామ వ్యవసాయ మార్కెట్ పాలక వర్గంలో రఘునాథపల్లి మండలానికి అధిక ప్రాధాన్యం లభించింది. వైస్ చైర్మన్‌తో పాటు మూడు డైరెక్టర్ పోస్టులు వరించాయి. ఎమ్మెల్యే రాజయ్యకు అత్యంత విధేయుడిగా ఉన్న ప్రస్తుత బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి, గోవర్ధనగిరికి చెందిన ముసిపట్ల విజయ్ వైస్ చైర్మన్‌గా, డైరెక్టర్లుగా కొనసాగిన వెల్ది గ్రామానికి చెందిన నూనెముంతల యాకస్వామి, నిడిగొండకు చెందిన మాల రాజు, ఖిలాషాపూర్‌కు చెందిన శివరాత్రి రాజు తిరిగి నియామకమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు వైస్ చైర్మన్, డైరెక్టర్లను అభినందించారు.

క్లుప్తంగా

నేత్రాల సేకరణ



జనగామ రూరల్: పట్టణంలోని గుండ్లగడ్డకు చెందిన సముద్రాల మనెమ్మ (85) అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, కుమారుడు సాంబయ్య అంగీకారం మేరకు ఆమె నేత్రలను లయన్స్ క్లబ్ ఆబాద్ ఆధ్వర్యంలో బుధవారం సేకరించారు. అధ్యక్షుడు ఉప్పలయ్య, బాబు, రమేష్ ఉన్నారు.

పరామర్శ

బచ్చన్నపేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దాచెపల్లి శ్రీనివాస్ బుధవారం మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని పలువురు నాయకులు పరామర్శించారు. మృత దేహంపై పూలమాల వేసి శ్రీనివాస్ పార్టీకోసం చేసిన సేవలను కొనియాడారు. పట్టణ అధ్యక్షుడు కోడూరి మహాత్మాచారి, ఎల్లయ్య ఉన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల అందజేత

పాలకుర్తి: చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను సేవాలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. శంకర్ నాయక్, అనిల్ చౌహాన్, హెచ్ఎం పాల్గొన్నారు.

అన్నదానం

జనగామ రూరల్: పట్టణానికి చెందిన గూడెల్లి పద్మావతి వర్ధంతి సందర్భంగా బుధవారం ఆమె కూతురు అల్లుడు బచ్చు రాణి-యాదగిరి అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాజరాజేశ్వరీ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు.

ఆర్థికసాయం

కొడకండ్ల: రంగాపురం గ్రామానికి చెందిన సోమారపు కొత్త వెంకటయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా, బుధవారం బాధిత కుటుంబానికి ఎల్ఐసీ ఏజెంట్ కూటికంటి వెంకటేశ్వర్లు ఆర్థిక సాయం, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. వెంకన్న, నల్లాల వెంకన్న, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య రక్షణకు పాటుపడాలి

జనగామ రూరల్: బీజేపీ అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలను ప్రతీ ఒక్కరు ప్రతిఘటిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జిల్లా కమిటీ సభ్యురాలు పల్లెర్ల లలిత అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ 9 ఏళ్లుగా బీజేపీ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతుందని విమర్శించారు. విభజన హామీలు తుంగలో తొక్కిందని ప్రజాస్వామ్య పరిరక్షణకు హక్కుల రక్షణకు ఈనెల 27వ తేదీన జనగామ చౌరస్తాలో భారీ జనచైతన్య మహాసభ ఉంటుందని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రకాష్, అజారుద్దీన్, బాల్నె వెంకట మల్లయ్య, కల్యాణ లింగం, కళ్యాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కనకారెడ్డి

రైతులకు సాగునీరు అందించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని రప్పించి ఘన్‌పూర్ రిజర్వాయర్‌ను నింపి స్టేషన్‌ఘన్‌పూర్, ఛాగల్లు కెనాల్‌కింద ఉన్న రైతులకు సాగునీరు అందించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సాగునీరు అందక ఘన్‌పూర్ రిజర్వాయర్, ఛాగల్లు కెనాల్ పరిసర ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా స్థానిక ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి ఏమాత్రం పట్టడం లేదని విమర్శించారు. రిజర్వాయర్‌ల ద్వారా రైతులకు సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. ఇప్పటికైనా కడియం, రాజయ్య ఆధిపత్య పోరును పక్కన పెట్టి రైతుల సమస్యలపై స్పందించాలని, తక్షణమే రైతులకు సాగునీరు అందించాలని ఆమె డిమాండ్ చేశారు. నాయకులు చింత ఎల్లయ్య, సింగపురం వెంకటయ్య, మహేందర్ పాల్గొన్నారు.

'గ్రామ స్వచ్ఛత'లో అశ్రద్ధ వహించొద్దు


మాట్లాడుతున్న ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి

చిల్పూరు: గ్రామ స్వచ్ఛత ప్రణాళిక రూపొందించడంలో అశ్రద్ధ వహించవద్దని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో బుధవారం స్వచ్ఛభారత్ మిషన్ ఫేస్-2 కార్యక్రమాలపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్‌బీఎం కర్ణాకర్, చిల్పూరు, జఫర్‌గఢ్, నర్మెట ఎంపీఓలు మధుసూదన్, సుమన్, అరవింద్, చిల్పూరు, జనగామ ఐకేపీ ఏపీఎంలు ఈద రమేష్‌కుమార్, నరేందర్, ఈసీ కిరణ్‌కుమార్, సర్పంచ్‌లు ఉద్దెమారి రాజ్‌కుమార్, పంచాయతీ కార్యర్శులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన


మాట్లాడుతున్న చంద్రశేఖర్

చిల్పూరు: మహిళలు నాయకత్వ లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలని నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని రాజవరంలో నాబార్డు సౌజన్యంతో జన వికాస గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌జీ మహిళలకు నాయకత్వ లక్షణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వశక్తి మహిళలు నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని బుక్ కీపింగ్, పొదుపులు, క్రెడిట్ రుణాల సౌకర్యాలు, తీసుకున్న రుణాలను ఉపయోగించుకుని అసెట్ క్రియేషన్ చేసుకోవాలని.. అప్పుడే మహిళలు ఆర్థికాభివృద్ధి చెందుతారని అన్నారు. స్వశక్తి మహిళలకు బ్యాంకులు ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ. 20 లక్షలు వరకు రుణసౌకర్యం అందిస్తాయని చెప్పారు. అనంతరం జనపనారతో సంచుల తయారీ నేర్చుకున్న మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. జన వికాస గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యదర్శి పెండ్లి సంపత్‌కుమార్, రైతు ఉత్పత్తి దారుల సంస్థ సీఈఓ అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

అంధత్వ నివారణకే 'కంటి వెలుగు'

బచ్చన్నపేట: అంధత్వ నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బండనాగారం, మన్‌సాన్‌పల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల అంధత్వ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. కంటి పరీక్షలు చేయించుకుంటే అవసరమున్న వారికి ఉచిత అద్దాలను అందిస్తారని తెలిపారు. దశల వారిగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. వైద్యులు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశాలు పలువురు పాల్గొన్నారు.


శిబిరాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి

కాన్షీరాం ఆశయాలను కొనసాగించాలి

లింగాలఘణపురం: బహుజనులను అణచివేస్తున్న అగ్రకుల రాజ్యాధికారానికి తూట్లు పొడిచిన రాజకీయవేత్త కాన్షీరాం ఆశయాలను కొనసాగించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ నీర్మాల రత్నం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు భిక్షపతి ఆధ్వర్యంలో కాన్షీరాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. కాన్షీరాం ఆశయాలను సాధిద్దాం అంటూ నినాదాలు చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ మహేందర్, మండల ఉపాధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న నాయకులు

క్లుప్తంగా

నిధులు కేటాయించాలి

దేవరుప్పుల: మండలంలోని చిన్నమడూరు రెవెన్యూ పరిధి రంబోజీగూడెం పంచాయతీ పరిధిలో పురాతన ఆలయాల పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును బుధవారం ఆ గ్రామ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. శ్యామల విక్రమ్‌రెడ్డి, చెంచు మల్లారెడ్డి ఉన్నారు.

పంచాంగం ఆవిష్కరణ



దేవరుప్పుల శ్రీ వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయ పూజారి, శ్రీ చండీ పరమేశ్వరీ పీఠాధిపతి డాక్టర్ అవసరాల ప్రసాద్‌శర్మ సిద్ధాంతి గణింపపడిన శోభకృత్ నామసంవత్సర పంచాంగాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆవిష్కరించారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి క్వార్టర్‌లో బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో మంత్రిని కలిసి శ్రీ చండీపరమేశ్వరీ పీఠం పంచాంగాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ , రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, ప్రచార కార్యదర్శి దేవులపల్లి బాలచంద్రశర్మ, అర్చక సమాఖ్య ప్రతినిధులు, బీఆర్ఎస్ నియోజకవర్గ సీనియర్ నాయకులు కాకికరాల హరిప్రసాద్ రావు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత



బచ్చన్నపేట: బసిరెడ్డిపల్లికి చెందిన జక్కుల మణెమ్మ, అంజయ్య దంపతుల కుమార్తె నిహారిక వివాహానికి సామాజిక సేవాకర్త, బీజేపీ రాష్ట్ర నాయకుడు ముక్కెర తిరుపతిరెడ్డి పంపించిన పుస్తెమెట్టెలను కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు ఉమ్మెంతల మల్లారెడ్డి అందించారు. బుధవారం నూతన వధూవరులను ఆశీర్వదించి మాట్లాడుతూ నిరుపేదలకు సహాయపడడానికి తిరుపతిరెడ్డి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. నీల రమేష్, తేలు అంజయ్య, పంజాల ప్రభాకర్, నర్సింహులు, రామచంద్రం, భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మాపురంలో..

నర్మెట: అమ్మాపురం గ్రామానికి చెందిన కుంటి లక్ష్మి, పోశయ్య దంపతుల కూతురు కల్పన వివాహానికి సామాజిక సేవాకర్త, బీజేపీ రాష్ట్ర నాయకుడు ముక్కెర తిరుపతిరెడ్డి పంపించిన పుస్తెమెట్టెలను బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు అందించారు. మండల కార్యదర్శి గంగం ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రంజిత్, శ్రీధర్, అంజనేయులు, బన్నీ, మధు, కృష్ణ పాల్గొన్నారు.

నివాళి


ఆంజనేయులు (ఫైల్)

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పోకల ఆంజనేయులు (55) అనారోగ్యంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, ఎండి హయతలి, కావటి భాస్కర్‌యాదవ్, ఎండి షబ్బీర్ పార్టీ నాయకులతో కలిసి బుధవారం ఇబ్రహీంపూర్ చేరుకొని మృతదేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా కొనసాగుతున్న మృతుడి సోదరుడు శ్రీనివాస్, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం..

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య సంఘం నాయకులతో ఇబ్రహీంపూర్‌లో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి, ఐలేష్, అంజయ్య, కృష్ణ, యాకయ్య, ఏలియా తోపాటు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏడీకి తీవ్ర గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏడీ(అసిస్టెంట్ డైరెక్టర్)గా పనిచేసే ఎం. రమేష్ బుధవారం సాయంత్రం మండలంలోని రాఘవాపూర్-కోమళ్ల గ్రామాల మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. ఏడీ రమేష్ రోజూ మాదిరిగానే జనగామ డీఈఓ కార్యాలయంలో విధులు చేపట్టి కారులో హనుమకొండకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాఘవాపూర్-కోమళ్ల గ్రామాల మధ్య కారు టైర్ పేలడంతో ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. కాగా, గమనించిన స్థానికుల సమాచారం మేరకు బాధితుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.